క్లుప్తంగా

బెదిరించి కొట్టి బైక్, నగదు చోరీ చేశారని ఫిర్యాదు

రాజమహేంద్రవరం రూరల్: ఇంటికి వెళుతున్న తనను మార్గంమధ్యలో ముగ్గురు వ్యక్తులు ఆపి ఒక్కసారిగా దాడిచేసి చేతులతో కొట్టి చాకుతీసి చంపుతానని బెదిరించి జేబులోని రూ.4వేల నగదు, తనను తోసేసి బైక్ తీసుకుని పారిపోయారని లాలాచెరువు చోడేశ్వరనగర్‌కు చెందిన మంచిలి నరేష్ ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మంచిలి నరేష్ దానవాయిపేటలోని లీకూపర్‌షో రూంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 10.00 గంటలకు షాపు మూసివేసి పని మీద రాజానగరం వెళ్లాడు. తిరిగి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా ఇంటికి వెళుతుండగా అమ్మవారి గుడి దాటిన తరువాత 20నుంచి 25సంవత్సరాల వయసుగల ముగ్గురు యువకులు బైకును ఆపారు. ఒక్కసారిగా నరేష్‌పై దాడిచేసి చేతులతో కొట్టి చాకుతో చంపుతానని బెదిరించి చొక్కా, ప్యాంటుజేబులోని రూ.4వేలు నగదు తీసుకోవడంతో పాటు, బంగారు ఆభరణాలు ఏమైనా ఉన్నాయంటూ బెదిరించారు. దీంతో తనను కిందకు తోసేసి బైకును తీసుకొని వెళ్లిపోయారని నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొమ్మూరుఎస్సై ప్రియాకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. రూరల్ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై తన కార్యాలయంలో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీలలో పన్ను బకాయిలు వసూలు చేయాలని సూచించారు. శాటిలైట్‌సిటీలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక నూతనంగా నిర్మించబోయే గురుకుల పాఠశాల పనులు ప్రారంభం చేయడానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ పాండురంగారావు, ఎం.పీ.డీ.ఓ డి.శ్రీనివాస్, ఈ.వో.పి.ఆర్.డి ఆర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణ మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివార్ల ఆలయంలో సోమవారం ఉదయం 09.45గంటలకు 25వ తిరుకల్యాణ మహోత్సవం జరుగుతుంది. ఆలయ వంశంపారంపర్య ధర్మకర్త కామిని వెంకట రామప్రసాద్‌చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.

పోలీస్ చెక్‌పోస్టుల వద్ద గస్తీపై మాక్‌డ్రిల్

కంబాలచెరువు: ఉదయం 11 గంటలు...రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చాలా పెద్ద దొంగతనం జరిగింది. దొంగ పారిపోతున్నాడంటూ జిల్లాలోని పోలీసులందరికీ మెసేజ్. దొంగతనం ఎక్కడ జరిగింది. ఆ దొంగ ఏ నంబర్ ద్విచక్ర వాహనంపై పారిపోతున్నాడో జిల్లా పోలీసులందరికీ సమాచారం వచ్చింది. అలెర్ట్ అయిన పోలీసు యంత్రాంగం చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేశారు. స్థానిక క్వారీ సెంటర్ వద్ద మూడో పట్టణ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ముందస్తుగా జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వచ్చిన అలెర్ట్ మెసేజ్‌లో చెప్పిన విధంగా ఉన్న నంబర్‌తో కూడిన ద్విచక్ర వాహనం వచ్చింది. వెంటనే పోలీసులు అతనిని తనిఖీ చేసి, అదుపులోకి తీసుకున్నారు. విషయాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలిపారు. కట్‌చేస్తే అతను దొంగ కాదు..మఫ్టీలో ఉన్న పోలీసే. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టుల్లో పోలీసు సిబ్బంది పనితీరు తనిఖీ చేసేందుకు ఎస్పీ డి.నరసింహకిశోర్ ఈ విధంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇటీవల చైన్ స్నాచర్లు జిల్లా సరిహద్దులు దాటి వెళ్లిపోతుండగా పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఆదేశాలను పోలీసులు సిబ్బంది ఎప్పటికప్పుడు అనుసరిస్తూ వారిని ఒడిశా సరిహద్దుల వరకు వెంటాడి పట్టుకుని తమ ప్రతిభను కనపర్చారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో తమ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారా లేదా అనేది ఎస్పీ మాక్ డ్రిల్ ద్వారా తెలుసుకున్నారు. ఈ మాక్ డ్రిల్‌లో అప్రమత్తంగా వ్యవహరించిన మూడో పట్టణ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సినిమాలు



శ్యామల	:	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	:	హాంకాంగ్ వారియర్స్
సూర్యప్యాలెస్	:	ఐడెంటిటీ
స్వామి	:	సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	:	సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	:	గేమ్‌ఛేంజర్
రాజా	:	సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	:	సంక్రాంతికి వస్తున్నాం
మేనక	:	పుష్ప–2, హత్య (మార్నింగ్ షో)
రంభ	:	సైకోఫోర్స్, గాంధీ తాత చెట్టు (మ్యాట్నీ)
కుమారి	:	పుష్ప–2
అప్సర	:	డాకు మహారాజ్
అశోక	:	డాకు మహారాజ్
నామవరం		
వీఎస్ మహల్	:	సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	సంక్రాంతికి వస్తున్నాం
కడియం		
వెంకటసూర్య	:	సంక్రాంతికి వస్తున్నాం



జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న డి.పాప



జిల్లా పౌరసంబంధాల కార్యాలయంలో..



కళాదృష్టి సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందుకుంటున్న శర్మ తదితరులు



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ చిన్నరాముడు

ఘనంగా గణతంత్ర వేడుకలు

- వాడవాడలా జాతీయ జెండాల ఆవిష్కరణ
- ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్న అధికారులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో పలుచోట్ల గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత జేసీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సీహెచ్ శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఐ.కాశయ్య, డివిజనల్ పీఆర్ఓ ఎం.లక్ష్మణాచార్యులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవం వందనం చేశారు.

కళాదృష్టి సంస్థ ఆధ్వర్యంలో...

సీతంపేట గ్రంథాలయంలో గల డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు ఎడ్యుకేషన్ సెంటర్‌లో కళాదృష్టి సంస్థ ఆధ్వర్యంలో గణతంత్రం సందర్భంగా పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. పోరంకి కామేశ్వర శర్మను కళోన్ముఖ పురస్కారంతో, సీనియర్ గాయని వరలక్ష్మిని జాతీయ ఉత్తమ పురస్కారంతో సత్కరించారు.

ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు డి.పాపకి సర్టిఫికెట్‌ను ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ఎం.లక్ష్మీసూర్యప్రభ అందించారు. నగరంలో పలు చోట్ల జరిగిన ఘనతంత్ర దినోత్సవ వేడుకలలో వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నారాయణపురంలో మానేదొరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శనకు ప్రశంసలు

రిపబ్లిక్ డే వేడుకలలో వివిధ పాఠశాల విద్యార్థులు జాతీయ స్ఫూర్తి ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న స్వాతంత్య్ర సమర యోధుల వారసులను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు తో కలిసి సన్మానించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సాత్విక ' చేసిన శివ తాండవం యోగ ప్రదర్శనకు తొలి బహుమతి, ట్రిప్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థుల పాటకు రెండవ బహుమతి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహం బొమ్మూరు విద్యార్థుల నృత్య ప్రదర్శన, శ్రీనివాస రామానుజన్ స్కూలు విద్యార్థుల యోగా ప్రదర్శనలకు మూడో బహుమతి, మిగిలిన అన్ని పాఠశాల విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతి అందించారు.

క్రొవ్విడి లింగరాజు మనవడు భాస్కర్‌రావు, కారుమూరి మార్కెండేయులు కుమారుడు నాగ విశ్వనాథం, నెక్కంటి చంద్రావతి కుమారుడు ఆదినారాయణని కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్వాతంత్య్ర సమర యోధులు కుటుంబాల సభ్యులను అభినందించారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, జాగ్రత్తలపై జిల్లా ఫైర్ అధికారి ఎం.మార్టిన్ లుథర్ కింగ్ ప్రదర్శన నిర్వహించారు.



జాతీయ జెండాను ఎగురవేసిన సెల్యూట్ చేస్తున్న అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మురళీకృష్ణ



నారాయణపురంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు



కలెక్టర్ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ధవళేశ్వరం ఎస్సై హరిబాబు



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న గీతం వర్సిటీ సీఎంవో నిర్మల్‌రావు

ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో వివిధ దళాలు నిర్వహించిన కవాతు ఆహుతులను ఆకట్టుకొంది. పరేడ్ ఇన్‌చార్జిగా డీఎస్పీ టి.వి.ఆర్.కె.కుమార్ వ్యవహరించారు. పరేడ్ కమాండర్లగా ఆర్ఐ పి.సంజీవ్ కుమార్, కె.చంద్రశేఖర్ వ్యవహరించారు.

ఉత్తమ కవాతు ప్రదర్శనా అవార్డు

ఒకటో కంటింజెంట్ కవాతు ప్రదర్శన మొదటి బహుమతి గెలుచుకొంది. కమాండర్ ఆర్ఎస్ఐ ఐ.శంకర్, పి.సత్యరావు, సురేష్ పాల్గొన్నారు. 4వ కంటింజెంట్ కవాతు ప్రదర్శన ద్వితీయ బహుమతి గెలుచుకోగా కమాండర్ ఎఆర్ఎస్ఐ కామేశ్వరరావు, హరిబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. 7 కంటింజెంట్ కవాతు ప్రదర్శన 3వ బహుమతి సాధించింది.

జిల్లా కోర్టు ఆవరణలో..

కంబాలచెరువు: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సభ్యులు, కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. బి.ఎం మురళీకృష్ణ జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం భారతీయులందరూ జాతి, కుల, మత, వర్గాలకు అతీతంగా జరుపుకునే పండగరో



జాతీయపతాకానికి వందనం చేస్తున్న నిర్మా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్



ప్రియదర్శిని ఆశ్రమంలో జెండా ఎగురవేస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయభాస్కర్

జన్నారు. జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం జాతీయజెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రియదర్శిని ఆశ్రమంలో రిపబ్లిక్ వేడుకలకు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పిడుగు విజయభాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశ్రమ కరస్పాండెంట్ కె.స్వప్నవర్మ, ప్రిన్సిపాల్ ఆశాలత, ప్రత్యేక ఉపాధ్యాయినిలు ప్రేమలత, నిర్మల, ఎలిషారాజ్‌కుమార్, శాంతి, సునీత, ప్రియాంక పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు

నిర్మాలో..

రాజమహేంద్రవరం రూరల్: నిర్మా ఆవరణలో జాతీయ పతాకాన్ని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ ఎగురవేశారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సిబ్బంది పిల్లలకు మెరిట్ అవార్డులను ప్రదానం చేశారు. స్థానిక కవలగొయ్యిరోడ్డులోని ఫ్యూచర్‌కిడ్స్ గ్లోబల్ పాఠశాల ఆధ్వర్యంలో చెరుకూరి గార్డెన్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో గీతం యూనివర్సిటీ సీఎంవో నిర్మల్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్ పాల్గొన్నారు. చెరుకూరిగార్డెన్స్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఫ్యూచర్‌కిడ్స్ గ్లోబల్ పాఠశాల, గీతం యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహించాయి.

బాలాజీపేట ఆదర్శనగర్‌పార్కులో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సౌత్‌సెంట్రల్ రైల్వే స్కౌట్స్ విద్యార్థులతో కలిసి గణతంత్ర వేడుకలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి అనంతరం పార్కులో ఏర్పాటుచేసిన పార్లర్‌బార్‌ను ప్రారంభించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు. మంగళవారపుపేటలో గరిమెళ్ల సత్యనారాయణ ఛాత్రోపాధ్యాయ కళాశాలలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. బొమ్మూరులోని డ్వామా కార్యాలయంలో పీడీ నాగమహేశ్వరరావు, డీపీఆర్వో శ్రీనివాసరావు, రూరల్ తహసీల్దార్ సూర్యకుమార్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి వారి కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు.

సౌత్ సెంట్రల్ రైల్వే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో...

స్థానిక తూర్పురైల్వేస్టేషన్ క్వార్టర్స్ ఆవరణలో సౌత్ సెంట్రల్ రైల్వే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ,వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేయగా, వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి స్కౌట్స్అండ్‌గైడ్స్ జెండాను ఎగురవేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో జక్కంపూడి విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

జేగురుపాడులో..

కడియం: జేగురుపాడు గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద పంచాయతీ కార్యదర్శి ఐ.శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు. జీవీకే ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడు జెండా ఎగురవేశారు. సాంస్కృతిక పోటీల విజేతలకు ఉప సర్పంచ్ పాతూరి రాజేష్ సమకూర్చిన బహుమతులను సర్పంచ్ స్టాలిన్, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, ఆకుల సుధాకర్ గ్రామ పెద్దలు అందజేశారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఎస్ఆర్ఐ అద్దంకి పట్టాభి రామయ్య సమకూర్చిన రూ.మూడేసి వేలు పంపిణీ చేశారు. కడియపులంకలో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులతో కలిపి సంవిధాన్ సమ్మాన్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి , మార్గని సత్యనారాయణ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ టి.గణేష్ జెండా ఆవిష్కరించారు. గ్రామంలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ధవళేశ్వరం ఎస్సై హరిబాబు, కలెక్టర్ ప్రశాంతి ,ఎస్పీ నరసింహ కిషోర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఉమామహేశ్వరరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కంబాలచెరువు (రాజమహేంద్రవరంసిటీ): గోకవరం మండలం సంజీవయ్యనగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాయుడు ఉమామహేశ్వరరావు ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నికల కోడ్ కారణంగా అప్పుడు అవార్డు అందుకోలేకపోయారు. గణతంత్ర దినోత్సవ వేదికపై కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



కలెక్టర్ ప్రశాంతి, డీఈవో వాసుదేవరావు నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

ఎస్పీ బాలు గారితో అనుబంధం మరువలేనిది

సినీగాయని మాళవిక

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం(బాబు) గారితో అనుబంధం మరువలేనిదని సినీగాయని మాళవిక కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక ఆనం కళాకేంద్రంలో శ్రీహరి ఈవెంట్స్ వారి 35వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సినీసంగీత విభావరి ఆహుతులను అలరించింది. ఈ సందర్భంగా బాలు పాడిన పాటల ఆలపన వేళ మాళవిక ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం లక్కీడిప్ ద్వారా విజేతలకు బహుమతులను ఆర్గనైజర్ పిరాట్ల శ్రీహరి మాళవిక చేతుల మీదుగా అందజేశారు.



గాయకులను మెమెంటోతో సత్కరిస్తున్న సినీగాయని మాళవిక

అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో మేడ సత్యనారాయణకు చెందిన పెంకుటిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించింది. అమెరికాలో ఉంటున్న తన కుమారుడి వద్దకు భార్యతో కలిసి మేడ సత్యనారాయణ రెండు నెలల క్రితం వెళ్లారు. ఇంటిలో ఎవరూ ఉండటం లేదు. అయితే ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో స్థానికులు పరుగులు తీశారు. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేసింది. ఇంటిలో ఉన్న ఫ్రిజ్, ఫ్యాన్లు, టీవీ, వాషింగ్‌మెషీన్, మంచాలు, దుస్తులు, ఫర్నిచర్, వంట సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వీఆర్వో అఖిల్, విద్యుత్‌శాఖ సిబ్బంది వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రూ.20 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా.



రఘుదేవపురం అగ్నిప్రమాదంలో దగ్ధం అయిన పెంకుటిల్లు

బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ ర్యాలీ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం): జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ ఫ్రీడమ్ ఫైటర్స్ పార్కులో మహిళ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంవిధాన్ ర్యాలీ ప్రారంభించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి,, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన నగర ఇంచార్జి అత్తి సత్యనారాయణ, చెరుకూరి రామారావు, వై శ్రీనివాస్ ర్యాలీలో పాల్గొన్నారు. శ్యామల సెంటర్, విజయ టాకీస్ మీదుగా గోదావరి గట్టు నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్ వరకూ సంవిధాన్ ర్యాలీ సాగింది. అక్కడ సంవిధాన్ అభియాన్ సభలో ఎంపీ పురందేశ్వరి ముఖ్య అతిథిగా మాట్లాడారు.



సంవిధాన్ ర్యాలీలో పురందేశ్వరి, దుర్గేష్, గోరంట్ల, సోము తదితరులు

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: మానసిక పరిస్థితి సరిగా లేక మద్యానికి బానిసైన ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం పాతబొమ్మూరుగ్రామంలోని జీపీఆర్‌తోటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పాతబొమ్మూరు జీపీఆర్‌తోటలో మర్రి రంగప్రసాద్‌బాబు నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఉద్యోగం నిమిత్తం విజయవాడలో ఉంటున్నాడు. ఇక్కడ ఇద్దరు కుమారులు ఉంటారు. రెండవ కుమారుడు మర్రి రాజారంజిత్‌కుమార్(23)మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు మద్యం, గంజాయి మత్తుకు బానిసగా మారాడు. ఆదివారం ఉదయం 9.00గంటల సమయంలో చిన్నకుమారుడు లేచిచూసేసరికి రంజిత్‌కుమార్ దూలానికి ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. తండ్రి రంగప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రంజిత్‌కుమార్ మృతదేహం

వరకట్నం కేసు నమోదు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన తంగిరాల వెంకటసాయి శ్రీఅహల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రామకృష్ణ పవన్, అత్త,మామలపై వరకట్నం కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2022లో అహల్యకు హైదరాబాద్‌లోని నాగోలుకు చెందిన తంగిరాల రామకృష్ణ పవన్‌తో వివాహం అయింది. హైకోర్టులో జాబ్ చేస్తున్నానని, లాయర్ వద్ద జూనియర్‌గా పనిచేస్తున్నానని భార్యను మోసం చేస్తున్నాడని, స్టీల్ వాటర్ బాటిల్‌తో కొట్టడంతో అహల్యకు ఎడమ చెవి వినికిడి లోపం వచ్చినట్లు తెలిపారు. అధిక వరకట్నం కోసం కర్రతో కొడుతూ శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్లు భర్త రామకృష్ణ పవన్, అత్త మహాలక్ష్మి, మామ సూర్య నారాయణమూర్తిపై అహల్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.